క్లుప్తంగా

క్రోధి నామ సంవత్సరాదిన విశేష అభిషేకాలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): క్రోధి నామ సంవత్సరాదిని పురస్కరించుకుని కొత్తపేట ఆంజనేయ వాగు సెంటర్‌లోని శ్రీ వీరాంజనేయ స్వామి వారి దేవస్థానంలో ఉన్న శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి ఆలయంలో విశేష అభిషేకాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకుడు విన్నకోట శ్రీనివాసరావు శర్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 9వ తేదీ తెల్లవారుజామున స్వామి వారికి సుప్రభాత సేవ, అనంతరం పంచామృతాలతో అభిషేకాలు, అర్చన జరుగుతాయన్నారు. స్వామి వారికి విశేషంగా జరిగే అభిషేకాలలో భక్తులందరూ పాల్గొని తరలించాలని ఆలయ ఈవో రావూరి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. ఉత్సవాన్ని పురస్కరించుకుని ఆలయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

వీఎంసీ అసిస్టెంట్ కమిషనర్‌గా శ్రీనివాస్



పటమట(విజయవాడ తూర్పు): విజయవాడ నగరపాలక సంస్థ సర్కిల్–2 ఇన్‌చార్జి అసిస్టెంట్ కమిషనర్‌గా వీఎంసీ మేనేజర్ బొమ్మాడి శ్రీనివాస్‌ను నియమిస్తూ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. సర్కిల్–2 అసిస్టెంట్ కమిషనర్‌గా విధులు నిర్వహించిన అనసూయ గతనెలలో ఉద్యోగ విరమణ చేయటంతో కమిషనర్ ఆ స్థానంలో శ్రీనివాస్‌ను నియమించారు. శనివారం శ్రీనివాస్ బాధ్యతలు స్వీకరించారు.

ఆకట్టుకున్న భక్తిగీతాలు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం వేదికపై అమ్మవారి భక్తి గీతాలను ఆలపించారు. శనివారం సాయంత్రం అమ్మవారి పంచహారతుల సేవ అనంతరం సంతాన వేణుగోపాల భజన మండలికి చెందిన పి.ఉదయశ్రీ గీత బృందం పలు అమ్మవారి భక్తి గీతాలను ఆలపించారు. అమ్మవారిని దర్శించుకున్న అనంతరం రాజగోపురం వద్దకు చేరుకున్న భక్తులు ఎంతో ఆసక్తితో భక్తి గీతాలను ఆలకించారు. అనంతరం భజన మండలి సభ్యులకు అమ్మవారి దర్శనం కల్పించిన దేవస్థాన అధికారులు ప్రసాదాలను అందచేశారు.

నేడు ఆర్యవైశ్య సంఘాల ప్రమాణ స్వీకారోత్సవం



లబ్బీపేట(విజయవాడతూర్పు): విజయవాడ అర్బన్, జిల్లా ఆర్యవైశ్య సంఘాల నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం ఆదివారం మొగల్రాజపురంలోని అమ్మ కల్యాణ మండపంలో నిర్వహించనున్నట్లు సంఘం అధ్యక్షుడు గడ్డం సత్యనారాయణ తెలిపారు. కస్తూరిబాయిపేటలోని విజయవాడ అర్బన్ ఆర్యవైశ్య సంఘం కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రమాణ స్వీకారోత్సవ బ్రోచర్‌ను ఆవిష్కరించారు. అనంతరం గడ్డం సత్యనారాయణ, పూర్వ అధ్యక్షుడు దర్శి వాసు మాట్లాడుతూ సేవా కార్యక్రమాల్లో తమ సంఘం ఎప్పుడూ ముందుంటుందన్నారు. రానున్న రోజుల్లో నూతన కార్యవర్గ సభ్యులు సేవలను మరింత విస్తృతం చేయనున్నట్లు తెలిపారు.

దాడి చేసిన ఇద్దరిపై కేసు నమోదు

పెనమలూరు: గంగూరు గ్రామంలో ఆటో డ్రైవర్‌పై ఇద్దరు వ్యక్తులు దాడి చేయటంతో పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గంగూరు ఉర్దూ స్కూల్ ప్రాంతానికి చెందిన నందిపాముల సురేష్ ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. అతనికి అదే ప్రాంతానికి చెందిన కోటమ్మ ఫోన్ చేసి ఆటో కిరాయికి రావాలని కోరింది. దీంతో సురేష్ ఆటోతో కోటమ్మ ఇంటికి వెళ్లాడు. అయితే అక్కడ కుమారి, కోటమ్మ, సతీష్ పలువురు వ్యక్తులు ఉన్నారు. ఆటో డ్రైవర్ సురేష్ వద్దకు వెళ్లి సతీష్, కోటమ్మలు ఆగ్రహం వ్యక్తం చేస్తూ కుమారి పట్ల అసభ్యంగా మాట్లాడుతున్నావు ఏమిటని అతనిపై దాడి చేశారు. దీంతో సురేష్ తలకు గాయమైంది. ఈ ఘటనపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయటంతో సతీష్, కోటమ్మలపై పోలీసులు కేసు నమోదు చేశారు.

కౌలువేలం ద్వారా రూ.13.33 లక్షల ఆదాయం

నందిగామ: మండలంలోని దాములూరు కూడలి సంగమేశ్వరస్వామి వారి ఆలయ భూముల కౌలువేలం శనివారం ఆలయ ప్రాంగణంలో నిర్వహించారు. ఆలయానికి గల 76.70ఎకరాల భూమికి కౌలువేలం పాట ద్వారా స్వామివారికి రూ.13.33లక్షల ఆదాయం వచ్చిందని ఆలయ ఈవో భూపాల్ తెలిపారు. గతేడాది కంటే ఈసారి రూ.2లక్షలు అదనంగా ఆదాయం వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కనగాల వెంకటేశ్వరరావు, గ్రామరైతులు పాల్గొన్నారు.

నేను పక్కా లోకల్.. నిత్యం ప్రజల మధ్యే ఉంటా

- బడాబాబులు డబ్బు సంచులతో వచ్చినంత మాత్రాన ఏమీ అవదు
- 'పశ్చిమం'లో మతతత్వ శక్తులకు చోటు లేదు
- వైఎస్సార్‌సీపీ పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ ఆసిఫ్
- 39వ డివిజన్‌లో మేయర్, కార్పొరేటర్‌తో కలసి ఎన్నికల ప్రచారం



ఎన్నికల ప్రచారంలో భాగంగా వృద్ధుడికి కరపత్రం అందజేస్తున్న షేక్ ఆసిఫ్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): 'నేను స్థానికుడిని. నిత్యం ప్రజల మధ్య ఉండే వ్యక్తిని, ప్రజలకు ఏ సమస్య వచ్చినా నా సమస్యగా భావించి పరిష్కరిస్తా' అంటూ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ ఆసిఫ్ స్పష్టం చేశారు. పశ్చిమ నియోజకవర్గం విద్యాధరపురం 39వ డివిజన్‌లో శనివారం నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, కార్పొరేటర్ గుడివాడ నరేంద్ర తో కలిసి ఎమ్మెల్యే అభ్యర్థి ఆసిఫ్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. డివిజన్‌లో ప్రతి ఒక్కరిని కలుసుకుంటూ ఆప్యాయంగా పలుకరించుకుంటూ ఓట్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పశ్చిమ నియోజకవర్గం అంటేనే కులమతాలకు అతీతమైందని, ఇక్కడ మతతత్వ శక్తులకు చోటు లేదని స్పష్టం చేశారు. ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో జరిగిన అభివృద్ధిని చూసి ఓటు వేయాలని ప్రజలను కోరారు. ఏ వీధికి వెళ్లినా ప్రజలే ముందుకు వచ్చి ఈ ప్రభుత్వంలో తమకు అందిన సంక్షేమం, తమ ప్రాంతంలో జరిగిన అభివృద్ధి గురించి వివరిస్తున్నారన్నారు. ప్రజలంతా సంతోషంగా ఉన్నారన్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ తాను ఎన్నికలకు 50 రోజుల ముందు ఎక్కడి నుంచో డబ్బు మూటలతో వలస వచ్చినవాడిని కాదు. నేను ఇక్కడే పుట్టా.. ఇక్కడే పెరిగాను. ఎవరో ఇక్కడికి వచ్చి డబ్బు విసురుతాం. ఏదో చేసేస్తామంటే ఇక్కడి ప్రజలు సహించబోరన్నారు. ధనంతో పశ్చిమ నియోజకవర్గ ప్రజలను కొనలేరన్నారు. వారి కష్టసుఖాలు తెలుసుకుని ముందుకు వెళ్లే వారి వెంటే పశ్చిమ ప్రజలు ఉంటారన్నారు. నియోజకవర్గ ప్రజలంతా వైఎస్సార్‌సీపీ పక్షానే ఉన్నారన్నారు. తాను ఇక్కడ భారీ మెజారిటీతో గెలుపొందుతానని ధీమా వ్యక్తం చేశారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వలంటీర్ వ్యవస్థ ద్వారా 58 నెలల పాటు ఇంటి వద్దనే అవ్వాతాతలకు పెన్షన్ అందజేశారని గుర్తు చేశారు. చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ నిర్వాకం వల్లే పేదలు రోడ్డెక్కాల్సి వచ్చిందన్నారు. తమకు పెన్షన్ కష్టాలు లేకుండా ఉండేందుకు వైఎస్ జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకునేందుకు సిద్ధంగా ఉన్నామని ప్రజలందరూ స్పష్టం చేస్తున్నారని చెప్పారు. గత ఐదేళ్లుగా పశ్చిమ నియోజకవర్గంలో మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపట్టారని, వాటిని తాను కూడా కొనసాగించడంతో పాటు సీఎం జగనన్న సహకారంతో మరింత అభివృద్ధికి కృషి చేస్తానని ఆసిఫ్ తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు యలకల చలపతిరావు, మరుపిళ్ల రాజేష్, చైతన్య రెడ్డి, 52వ డివిజన్ ఇన్‌చార్జి తంగిల రాము, మైలవరపు దుర్గారావు, నాయకులు ఏలూరు వెంకన్న, అంబడిపూడి శ్రీకాంత్, బీవీరెడ్డి, పోతిరెడ్డి సుబ్బారెడ్డి, రాజవరపు వెంకట్, బోండా సాంబశివరావు, కొండ రెడ్డి, రోశి రెడ్డి, ఎల్.శేఖర్, చంద్ర రెడ్డి, కరీముల్లా, నాగమణి, లక్ష్మి, ముంతాజ్ బేగం తదితరులు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఆసిఫ్



ఇఫ్తార్ విందులో ఆసిఫ్, ఇతర పార్టీ నేతలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): వైఎస్సార్‌సీపీ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధికార ప్రతినిధి షేక్ మెహరాజ్ ఆధ్వర్యంలో శనివారం చిట్టినగర్‌లోని మోతీ మసీదు ఆవరణలోని షాదీఖానాలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఇఫ్తార్ విందుకు ముఖ్య అతిథిగా వైఎస్సార్‌సీపీ పశ్చిమ అభ్యర్థి షేక్ ఆసిఫ్ హాజరు కాగా, మోతీ మసీదు కమిటీ పెద్దలు, స్థానిక పెద్దలు, యువత పాల్గొన్నారు. తొలుత ఆసిఫ్ ముస్లిం పెద్దలు, సోదరులతో కలిసి ప్రత్యేక నమాజులో పాల్గొన్న అనంతరం ఇఫ్తార్‌ను స్వీకరించారు. రానున్న సార్వత్రిక ఎన్నికలలో ఎమ్మెల్యేగా తనకు, ఎంపీగా కేశినేని నానిలకు మద్దతుగా నిలవాలని కోరారు. పాతబస్తీ అంటే అన్ని కులాలు, మతాలకు చెందిన వారు శాంతియుత జీవనాన్ని కొనసాగిస్తారన్నారు. నేడు మతోన్మాద శక్తులు, కార్పొరేట్ మోసగాళ్లు ఇక్కడి నుంచి చట్ట సభలకు వెళ్లాలని చూస్తున్నారన్నారు. పశ్చిమ నియోజకవర్గ ప్రజలు అటువంటి వారికి తగిన రీతిలో బుద్ధి చెప్పాలన్నారు. జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ షేక్ గౌస్‌మొహిద్దీన్, 48వ డివిజన్ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి అత్తులూరి పెదబాబు, అధ్యక్షుడు పిల్లా సూరిబాబు, అయితా కిశోర్, సుభానీ ఖాన్, మోతీ మసీదు కమిటీ అధ్యక్షుడు మొహమ్మద్ బాషా, సెక్రటరీ పఠాన్ అక్బర్ ఖాన్, ఉపాధ్యక్షుడు షేక్ మహబూబ్, జాయింట్ సెక్రటరీ షేక్ సుభాని, కోశాధికారి పఠాన్ రషీద్ ఖాన్ పాల్గొన్నారు.

బాపు మ్యూజియంలో చేనేత హస్తకళా మేళా



చేనేత హస్తకళా మేళాలో వస్త్రాలను పరిశీలిస్తున్న వాణీ మోహన్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బందరు రోడ్డులోని బాపు మ్యూజియంలో చేనేత, హస్త కళా ప్రదర్శన, అమ్మకాలు ప్రారంభించినట్లు మేళా నిర్వాహకులు తెలిపారు. ఈనెల 19వ తేదీ వరకు ప్రతి రోజు ఉదయం 10 నుంచి రాత్రి 9 గంటల వరకు మేళా జరుగుతుందన్నారు. ఈ ప్రదర్శనలో వివిధ రాష్ట్రాల నుంచి నేరుగా ఉత్పత్తిదారులు తాము తయారు చేసిన నాణ్యమైన వస్త్రాలు విక్రయిస్తారన్నారు. ఈ ప్రదర్శనలో పోచంపల్లి, మంగళగిరి చీరలు, డ్రెస్ మెటీరియల్స్, బెంగాలీ కాటన్, శారీస్, జైపూర్ బెడ్ షీట్స్, ఖాదీ వస్త్రాలు, పొందూరు ఖద్దరు, కొండపల్లి, ఏటికొప్పాక చెక్క బొమ్మలు, హైదరాబాద్ ముత్యాలు, 1 గ్రామ్ జ్యూయలరీ, పూజా వస్తువులు, లెదర్ బ్యాగులు మొదలైన వస్తువులు అమ్మకానికి ఉన్నాయని నిర్వాహకురాలు పద్మజ తెలిపారు. ఈ ప్రదర్శనను వాణీమోహన్ ప్రారంభించి వస్త్రాలను తిలకించారన్నారు.

చిన్నారి వైద్యానికి దీవెన ఫౌండేషన్ సాయం



బాధితురాలి తండ్రికి చెక్కు అందజేస్తున్న మోహన్‌రెడ్డి

భవానీపురం(విజయవాడపశ్చిమ): బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతూ చికిత్స తీసుకుంటున్న విజయవాడ రామలింగేశ్వరనగర్ నగర్‌కు చెందిన జాజుల రిషిత (6) వైద్యానికి దీవెన ఫౌండేషన్ విజయవాడ సిటీ పోలీస్ తరపున రూ.15వేల చెక్కును అందజేశారు. బాధితురాలి తండ్రి జాజుల నాగకృష్ణ ఫొటోగ్రాఫర్‌గా పని చేస్తూ జీవనం సాగిస్తుండగా చిన్నారి వైద్యం నిమిత్తం చాలా ఖర్చు చేయాల్సి ఉండటంతో వారు దీవెన ఫౌండేషన్‌ను ఆశ్రయించారు. చిన్నారి రిషితకు ప్రస్తుతం కీమో థెరపీ ట్రీట్‌మెంట్ జరుగుతున్న నేపథ్యంలో శనివారం ఫౌండేషన్ సభ్యులు, పటమట సీఐ డీకేఎన్ మోహన్‌రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ నాగరాజు, ఫణీంద్ర చిన్నారి రిషిత చికిత్స పొందుతున్న హాస్పిటల్‌కు వెళ్లి బాధితురాలి తండ్రి నాగకృష్ణకు చెక్కును అందజేశారు. ఆపదలో ఉన్న పేదవారికి సహాయం చేస్తున్న దీవెన ఫౌండేషన్ సభ్యులకు నాగకృష్ణ కృతజ్ఞతలు తెలియజేశారు.

అత్తింటి వారిపై వరకట్నం వేధింపు కేసు

పెనమలూరు: వరకట్నం కోసం వేధిస్తున్న అత్తింటి వారిపై పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ టీవీవీ రామారావు తెలిపిన వివరాల ప్రకారం యనమలకుదురు గ్రామానికి చెందిన వెలిశిల కీర్తికుమారి 2014వ సంవత్సరంలో విజయవాడ చిట్టినగర్‌కు చెందిన సంజయ్‌కుమార్‌ను కట్న కానుకలు ఇచ్చి పెద్దలు వివాహం చేశారు. వీరికి పాప పుట్టింది. అయితే పెళ్లి సమయంలో భర్త ప్రభుత్వ ఉద్యోగం అని చెప్పగా అతనికి ఎటువంటి ఉద్యోగం లేదు. పైగా ఆడపిల్ల పుట్టిందని, ఇచ్చిన కట్నం చాలదని, అదనపు కట్నం తీసుకరమ్మని భర్తతో పాటు మామ విజయ్‌కుమార్, అత్త వెరోనికమ్మ, ఆడపడుచు ప్రశాంతి, ఆమె భర్త అజయ్‌కుమార్ వేధింపులకు గురి చేయటంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. ఈ ఘటనపై పోలీసులు వరకట్నం వేధింపు కేసు నమోదు చేశారు.

అన్నదానానికి విరాళాలు



పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసియున్న శ్రీతిరుపతమ్మవారి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి శనివారం ఖమ్మం జిల్లా, ముష్టికుంట గ్రామానికి చెందిన బంధం నాగభూషణం రూ.10,116 ఆలయ అర్చకులు, అధికారులు చేతుల మీదుగా అందజేశారు. ఖమ్మం పట్టణానికి చెందిన వీరపనేని సురేష్‌చంద్ర, లిఖిత దంపతులు నిత్యాన్నదానానికి రూ.1,016, అంకమ్మవారి ఆలయ గోపురం వెండి తాపడం తయారీకి రూ.9,216లు విరాళంగా అందజేశారు. దాతలను ఆలయ అధికారులు అమ్మవారి శేష వస్త్రం, ప్రసాదాలతో సత్కరించారు.

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి



బహుమతులు అందుకున్న విద్యార్థినులతో కల్యాణి తదితరులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని జీఎస్ఆర్ మున్సిపల్ హైస్కూల్ విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు జీవీ శ్రీనివాసరావు అన్నారు. భవానీపురం క్రాంబ్వే రోడ్‌లోని సెయింట్ జాన్స్ పాఠశాలలో శనివారం 39వ వార్షికోత్సవం సందర్భంగా బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమం జరిగింది. ఇందులో భాగంగా అకడమిక్, కో–కరిక్యులర్ యాక్టివిటీస్, క్రీడల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ పరీక్షలకు ఎలా, ఏ విధంగా చదివితే ఉత్తమ ఫలితాలను సాధిస్తారనే అంశంపై విద్యార్థులకు వివరించారు. సెయింట్ జాన్స్ పాఠశాల సెక్రటరీ/కరస్పాండెంట్ టి.సుమన్ త్యాగరాజ్ మాట్లాడుతూ విద్యార్థుల ప్రతిభను గుర్తించేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రెసిడెంట్ టి.మోనిక సుమన్, అకడమిక్ హెడ్స్ కేవీ కల్యాణి, పావన దీప్తి, ప్రిన్సిపాల్ సుచరిత పాల్గొన్నారు.

ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలి



సదస్సులో ప్రసంగిస్తున్న డాక్టర్ సోమలక్ష్మీ వెంకట శ్రావణకుమార్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విద్యార్థులు ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకునేందుకు అవసరమైన నైపుణ్యాలను పెంపొందించుకోవాలని జెడ్.ఎఫ్ టెక్నాలజీస్ సీఈవో డాక్టర్ సోమలక్ష్మీ వెంకట శ్రావణకుమార్ అన్నారు. పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ట్రిపుల్ ఈ విభాగం ఆధ్వర్యంలో ఎలక్ట్రికల్ వెహికల్ రంగంలో ఉపాధి అవకాశాలపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకట శ్రావణకుమార్ మాట్లాడుతూ సంప్రదాయ ఇంధన వనరులు రానురాను అడుగంటుతున్నాయన్నారు. ఆ క్రమంలో సంప్రదాయేతర ఇంధన వనరుల ఉత్పత్తిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టి సారిస్తున్నాయన్నారు. దాంతో ఎలక్ట్రికల్ వాహనాల వినియోగంపైనా ఇటీవల ఆయా విభాగాలు, మార్కెట్ వర్గాలు దృష్టి పెడుతున్నాయని చెప్పారు. దాంతో గడిచిన దశాబ్ద కాలంగా ఈ రంగంలో ప్రయోగాలు పెరుగుతున్నాయన్నారు. ఇటీవల ఎలక్ట్రికల్ వాహనాల ప్రాధాన్యత పెరగటంతో ఉపాధి అవకాశాలు సైతం పెరుగుతున్నాయని వివరించారు. విద్యార్థులు ఈ రంగానికి సంబంధించిన అంశాలపై పట్టు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ జె.లక్ష్మీనారాయణ, విభాగాధిపతి డాక్టర్ బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చిన మాట ప్రకారం అభివృద్ధి చేశాం

ఎన్నికల ప్రచారంలో డిప్యూటీ మేయర్ బెల్లం దుర్గ



మహిళలతో మాట్లాడుతున్న డిప్యూటీ మేయర్ బెల్లం దుర్గ

ఆటోనగర్ (విజయవాడ తూర్పు): ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అభివృద్ధి చేశామని డిప్యూటీ మేయర్ బెల్లం దుర్గ అన్నారు. రామలింగేశ్వర్ నగర్ లో శనివారం విజయవాడ తూర్పు నియోజకవర్గం వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దేవినేని అవినాష్, ఎంపీ అభ్యర్థి కేశినేని శ్రీనివాస్‌లకు మద్దతుగా ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గులాబీతోట, ఆంజనేయ స్వామి గుడి, విమానం తోట, రజిత్‌భార్గవ్ రోడ్డులో ప్రచారం చేశారు. ప్రతి ఇంటికీ వెళ్లి వైఎస్సార్ సీపీ అభ్యర్థులకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా బెల్లం దుర్గ మాట్లాడుతూ రామలింగేశ్వర నగర్‌ను మోడల్ డివిజన్‌గా తీర్చిదిద్దినట్టు చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు ఆళ్ళ చెల్లారావు, మాదాసు భాను, నూకల సత్యనారాయణ, చంటి, దశరథరామయ్య, అక్కిరయ్య, శ్రీను, నారాయణ, చిన్ని, దానియేలు, రాజు, హరీష్ పాల్గొన్నారు.

యనమలకుదురు ఆలయంలో ప్రత్యేక పూజలు



పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ పార్వతీ సమేత శ్రీ రామలింగేశ్వరస్వామివారి దేవస్థానంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో శనిత్రయోదశి పర్వదినంగా ఉదయం శనీశ్వరస్వామివారికి విశేష తైలాభిషేకం చేశారు. భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం ఆలయంలో శ్రీనందీశ్వరస్వామివారికి ప్రదోష సమయంలో అభిషేకం, అర్చన చేశారు. ఆలయ ప్రధాన పూజారి జీఆర్‌వీ సాగర్ ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

ఇరువురు మద్యం విక్రేతల అరెస్ట్

తిరువూరు: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఇరువురు మహిళలను తిరువూరు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు శనివారం అరెస్టు చేశారు. తిరువూరు బోయకాలనీలో నల్లబోతుల స్వాతి మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం అందుకుని దాడి నిర్వహించగా 23 సీసాలు లభ్యమయ్యాయి. ఎ.కొండూరు మండలం పాల్తియా తండాలో అజ్మీరా చిన్ని వద్ద 5 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని అరెస్టు చేసినట్లు ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ అశోక్ తెలిపారు. ఇరువురిని తహసీల్దార్ల ఎదుట బైండోవర్ చేశామని తెలిపారు.

పారదర్శకంగా ఎన్నికల నిర్వహణకు చర్యలు

జేసీ సంపత్‌కుమార్



వెల్వడంలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న జేసీ సంపత్‌కుమార్

మైలవరం: సార్వత్రిక ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని విధాలుగా చర్యలు తీసుకున్నామని ఎన్టీఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్, రిటర్నింగ్ అధికారి పి.సంపత్‌కుమార్ తెలిపారు. మైలవరం మండలం మొర్సుమల్లి చెక్‌పోస్ట్, వెల్వడం, మైలవరంలోని పోలింగ్ బూత్‌లను రెవెన్యూ అధికారులు, సిబ్బందితో కలిసి శనివారం ఆయన పరిశీలించారు. మైలవరం మండలంలో రాష్ట్రాల సరిహద్దులోని మొర్సుమల్లి గ్రామంలో చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీ నిర్వహించారు. మైలవరం మండలం వెల్వడం, మైలవరం గ్రామాలలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. చెక్‌పోస్టుల వద్ద సిబ్బంది అక్రమ మద్యం, డబ్బు రవాణా జరుగకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసి ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో తహసీల్దారు టీఆర్ రాజేశ్వరరావు, సీఐ కిశోర్ బాబు, ఎస్ఐ హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మార్కెటింగ్ సృష్టించే విలువలపై వెబినార్

మధురానగర్(విజయవాడసెంట్రల్): సాంఘిక సంక్షేమ గురుకుల ప్రభుత్వ డిగ్రీ మహిళా కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ వల్లూరి నీరజ అధ్యక్షతన శనివారం మార్కెటింగ్ సృష్టించే విలువలపై వర్చువల్‌గా వెబినార్ జరిగింది. కార్యక్రమంలో విజయవాడ పీబీ సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్సు కళాశాల డీన్ డాక్టర్ రాజేష్ సీ జంపాల ముఖ్యఅతిథిగా పాల్గొని 'వస్తు సేవల కల్పనలోనూ, వాటి అవసరాన్ని ప్రచారం చేయడంలోనూ, వాటిని వినియోగదారుడికి అందజేయడంలోనూ మార్కెటింగ్ పాత్ర' అనే అంశంపై ప్రధాన ఉపన్యాసం చేశారు. నేడు మార్కెట్‌లో బ్రాండును బట్టి వస్తు సేవల అమ్మకాలు జరుగుతున్నాయని, వినియోగదారులను గుర్తించడంలోనూ, వారిని సంతృప్తి పరచడంలోనూ, తమ వస్తువులను మాత్రమే వాడేటట్లు చేయడంలో మార్కెటింగ్ పాత్రను వివరించారు. మార్కెటింగ్ మౌలికాంశాలను, నాలుగు పీ(ప్రోడక్ట్, ప్రైస్, ప్లేస్, ప్రమోషన్)లు గురించి తెలియజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు అడిగిన సందేహాలను నివృత్తి చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ నీరజ మాట్లాడుతూ నేటి అత్యాధునిక యుగంలో మన జీవితాలను ప్రభావితం చేసే స్థాయికి ఎదిగిన మార్కెటింగ్ రంగం గురించి విద్యార్థినులకు అవగాహన కల్పించేందుకు వెబినార్ ఏర్పాటు చేశామని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్రంలోని వివిధ కళాశాలలకు చెందిన అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పేరంటాలమ్మ ఆలయంలో రేపు చండీహోమం

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడు శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో ఈనెల 8వ తేదీన అమావాస్య సందర్భంగా చండీ హోమం నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ బోయిన భాను ప్రదీప్ శనివారం తెలిపారు. ఉదయం 8.30 గంటలకు ఆలయ ప్రాంగణంలో హోమం నిర్వహిస్తామని, పాల్గొనదలచిన భక్తులు ముందుగా ఆల య కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. ఈనెల 9న తెలుగు సంవత్సర ఉగాది సందర్భంగా ఆలయంలో పంచాంగ శ్రవణం కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. ఈనెల 13న క్రోధి నామ సంవత్సర చైత్రశుద్ధ పంచమి వసంత నవరాత్రుల సందర్భంగా శ్రీ మహాలక్ష్మి అమ్మవారికి సహస్రనామ కుంకుమార్చన అష్టోత్తర శతకలశార్చన అభిషేకం, శ్రీ మహాలక్ష్మి యాగం జరుగుతుందన్నారు. ఆలయంలో నిర్వహించబోయే ఆయా పూజాది కార్యక్రమాల్లో భక్తులు పాల్గొనాలని కోరారు.

పేకాట శిబిరంపై దాడి

కంకిపాడు: పేకాట శిబిరంపై పోలీసులు శుక్రవారం అర్ధరాత్రి దాడులు నిర్వహించారు. ఎస్ఐ డి.సందీప్ తెలిపిన కథనం మేరకు.. మండలంలోని తెన్నేరు గ్రామ శివారు ఖాళీ పొలాల్లో పేకాట శిబిరం నిర్వహిస్తున్నట్లు సమాచారం అందటంతో ఆ ప్రాంతంపై దాడులు నిర్వహించారు. పేకాట ఆడుతున్న నలుగురు జూదరులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.7020 నగదు స్వాధీనం చేసుకున్నారు. గేమింగ్ యాక్ట్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సందీప్ తెలిపారు.

ఓటు హక్కు వినియోగంపై అవగాహన



ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పిస్తున్న రమ్యశ్రీ

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఎవరి ఒత్తిళ్లకు ప్రభావితం కాకుండా ప్రతి ఒక్కరూ నిష్పక్షపాతంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని ఏఈఆర్ఓ రమ్యశ్రీ అన్నారు. రూరల్ మండలం జక్కంపూడి వైఎస్సార్ కాలనీలోని 5వ గ్రామ సచివాలయంలో శనివారం ఓటర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఈ దఫా ఎన్నికల్లో ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు ప్రత్యేకంగా, వినూత్నంగా సిస్టమాటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్ట్రోరల్ పార్టిసిపేషన్ (స్వీప్) కార్యక్రమాలను జిల్లా యంత్రాంగం నిర్వహిస్తోందన్నారు. తద్వారా ఓటర్లను చైతన్యవంతులను చేయనున్నామని చెప్పారు. ఓటింగ్ శాతాన్ని పెంచడంలో ప్రజా భాగస్వామ్యం అవసరమన్నారు. ఓటర్లు తమ మనస్సాక్షి ప్రకారం ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. సదస్సులో ఈఓఆర్‌డీ శేషగిరిరావు పాల్గొన్నారు.